## 2 వ కథ.

# జాతస్య మరణం.

*

మరణానికి కారణా లనేకం! కానీ పుట్టిన ప్రతిజీవి మరణిస్తుంది. ఒక కారణాన్ని ఆమరణానికి అన్వయించుకోవటం మామూలైపోయింది.

*

"వానరాకడా, ప్రాణం పోకడా" తెలియదంటారు! ఏమీ కారణం లేకుండానే మనుషులు చచ్చిపోతారనే విషయాన్ని ఒక పట్టాన నమ్మలేడు శేషగిరి! అసలు శేషగిరి వాళ్ల అమ్మమ్మగారింట్లో పుట్టాడు. పుట్టినప్పుడు చాలా అందంగా— దబ్బపండులాగా— వుండేవాడని— ఇప్పటికీ శేషగిరి తాలూకు బామ్మలు చెప్పుకుంటూంటే విని గర్వపడుతూంటాడు తను. కానీ ఏంలాభం? పుట్టినవేళ— నక్షత్రం మంచిదికాదన్నారు. బారసాల చేసుకునేందుకు— మూడుమైళ్ల దూరంలో వున్న— పొరుగూరునుంచి సైకిలుమీద వస్తున్న శేషగిరితండ్రి సుబ్బరామయ్య— అనాలోచితంగా— సైకిల్ను ఒక మేకకు ఢీకొట్టించి, తను క్రింద పడిపోయాడు. దెబ్బ ఎక్కడ తగిలిందో తెలియదుకానీ నోటినుండి రక్తం ప్రవహించింది. జనం అతనిచుట్టూ చేరేలోగానే అతను ప్రపంచానికి దూరమైపోయాడు. అన్నీ నిముషాలమీద జరిగిపోయినాయి.

శేషగిరి పుట్టిన నక్షత్రం మంచిదికాదన్నారు మళ్లీ.

* * *

తన నక్షత్రం మంచిదికానంతమాత్రాన తనతండ్రి ఎందుకు చనిపోవాలో శేషగిరికి ఇప్పటికీ అర్థంకాదు!

* *

సాయంత్రం!!!

కూతుర్ని తీసుకవెళ్లటానికి వచ్చిన రామకృష్ణయ్య వరండాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు.

ఆఫీసులో అలసిపోయి ఇంటికి వచ్చిన శేషగిరి పరధ్యానంగా కూర్చున్నాడు తనగదిలో!

"కాఫీ!"...

కాఫీకప్పుతో తనకెదురుగా వచ్చి నిలుచున్న శాంతను గమనించలేదు శేషగిరి.

"కాఫీ తీసుకోండి. చల్లారిపోతుంది"–

ఈసారి వినబడింది శేషగిరికి.

కప్పు తీసుకొని కాఫీ త్రాగేశాడు.

ఖాళీఅయిన కప్పును తీసుకుని తిరిగి వెడుతున్న శాంత చెయ్యి పట్టుకున్నాడు. ఆతరువాత ఆమెకళ్లల్లోకి దీనంగా చూశాడు.

"నువ్ వెళ్లక తప్పదా శాంతా?" అతని దీనాలాపన శాంతకు బాధకలిగించకపోలేదు.

"క్రింద మీ మావగారున్నారు. అడగండి"– అని చిలిపిగా అంది.

"నీకు వేళాకోళంగానే వుంటుందిలే!"– చిన్నపాపాయిలా అన్నాడు శేషగిరి.

ఈసారి శేషగిరిని చూసి బాధతోపాటు జాలికూడా పడింది.

"నాకుమాత్రం మిమ్మల్ని ఒదిలిపెట్టి వెళ్లాలని వుందేమిటి? కానీ మొదటి కాన్పు పుట్టింట పోసుకోవటం లోకాచారం! అయినా మూడు నెలలేగా?!"- శేషగిరిని ఓదార్చింది శాంత.

"మూడు నెలలు! తాను పిచ్చివాడైపోవటానికి మూడు నెలలు చాలు"- అని మనసులోనే అనుకున్నాడు శేషగిరి.

* * *

నిముషాలు లెఖ్ఖపెట్టుకుంటూ గంటలూ, వాటిని లెక్కిస్తూ రోజులూ- వారాలూ- గడుపుతున్నాడు శేషగిరి. అక్కడ శాంత ప్రసవవేదనకన్న ఇక్కడ శేషగిరి విరహవేదన రోజురోజుకూ ఎక్కువకావటంతో పిచ్చివానిలా మారిపోయాడు.

ఆఖరుకు వుత్తరం వచ్చింది- 'నాలుగురోజులక్రితమే శాంత మగపిల్లవానిని ప్రసవించిందనీ- తల్లీ, పిల్లవాడూ కులాసా అనీ- నక్షత్రంకూడా బ్రహ్మాండంగా వుందనీ వ్రాశారు మామగారు. అప్రియత్నంగానే ఒకసారి కాలరుసవరించుకున్నాడు శేషగిరి- తానూ ఒక తండ్రి అనిపించుకుంటున్నందుకు!

ఆశుభవార్తను తన ఆఫీసరుగారికి చెప్పాలనుకొని ఆయనదగ్గరకు వెళ్లాడు.

"కంగ్రాచ్యులేషన్స్"- తాను- చెప్పాలనుకొని నోరు తెరచిన శేషగిరి, ఆఫీసరుగారు తనకు ముందుగానే కంగ్రాచ్యులేషన్స్ చెప్పినందుకు ముందు ఆశ్చర్యపడి- తరువాత తేరుకొని- 'థాంక్స్' అన్నాడు.

"అబ్బాయి పుట్టినట్లు మీకూ తెలిసిందా సార్ ?" తన అనుమానం ఆయనముందు ప్రకటించాడు శేషగిరి.

"వ్హాట్! అబ్బాయి పుట్టాడా? అయితే" డబల్ "కంగ్రాచ్యులేషన్స్"- మళ్లీ అన్నారు ఆఫీసరుగారు. తాను కూడా డబల్ థాంక్స్ చెప్పాలనుకున్నాడు- ఈలోగా ఆయనే అన్నారు.

"నీకు ప్రమోషన్ వచ్చినట్లు ఇప్పుడే ఆర్డర్సు వచ్చాయి- ఇదిగో"- అంటూ కాగితాన్ని అందించాడు ఆఫీసరుగారు. ఆశుభసందర్భాన్ని పురస్కరించుకొని భారీ ఎత్తున స్వీట్సు పంచిపెట్టాడు శేషగిరి.

అబ్బాయి పుట్టిన వేళావిశేషం మంచిదన్నారు అందరూ !

ఆరాత్రి, శేషగిరి ఆలోచనలకు నారసుడై నిద్రకు దూరమయ్యాడు. తనకు కొడుకు పుట్టిన వేళావిశేషంవల్లనే

తనకు ప్రమోషన్ వచ్చిందని నమ్మాడు. మరునాడే వెళ్లి ఆ శుభవార్తను తన శాంతకు చెప్పటానికి నిశ్చయించుకున్నాడు శేషగిరి. ఎప్పుడు తెల్లవారుతుందా అని తూర్పు దిక్కుకు తిరిగి చూస్తూ పడుకున్నాడు...

* * *

శేషగిరికి తెల్లవారింది. అనుకున్నట్లుగా అత్తవారింటికి ప్రయాణమయ్యాడు. శకునం మంచిదే వచ్చింది. ఎప్పుడూ ఆలస్యంగా వచ్చే రైలుబండి ఆరోజున అసలు టైముకే వచ్చింది. అందుకు తను అనవసరంగా ఆశ్చర్యపడిపోతోంటే- ఆబండి అంతక్రితంరోజు ఆసమయానికి రావలసిన బండి అని ఎవరో అనుకోవటం విన్నాడు శేషగిరి. అప్పుడు ఆశ్చర్యపడటం మానేశాడు

రైలెక్కిన రెండుగంటలకే అత్తవారి వూరు చేరుకున్నాడు శేషగిరి.

'రమ్మంటారా బాబూ' అన్నాడు రిక్షావాలా- స్టేషన్ నుండి బయటకు వచ్చిన శేషగిరిని.

వద్దనలేదు శేషగిరి.

"ఇదివరలో ఇక్కడ రిక్షాలు వుండేవి కావు"— అన్నాడు దారిలో తను.

"మరే బాబూ! రెండే రిక్షాలు దిగాయి. అదైనా వచ్చి ఇంకా రెండు నెలలయినా కాలేదు"- అన్నాడు రిక్షా వాలా.

తన అత్తవారిల్లు దగ్గరపడుతోంది. రిక్షా ఇంటిదగ్గర ఆగగానే తన మరదలు ఉష 'అక్కా- బావొచ్చాడే' అంటూ లోపలకు వెళ్ళి శాంతకు చెబుతుంది. శాంత ఆనందంతో సిగ్గు పడుతుంది. ఎవరూ లేకుండా చూచి "అబ్బాయి అచ్చం మీపోలికే" అంటుంది. తను గర్వపడతాడు.

తన అత్తవారిల్లు ఇంకా దగ్గరకు వచ్చింది- ఆసందు తిరిగితే- చివరియిల్లు.

మలుపు త్రిప్పుతున్న రిక్షా వాలాకు ఆసందునుండి వస్తున్న చిన్నకారు హారన్ వినిపించలేదు. కారు మీదకు రావటంతో బ్రేకులు గట్టిగా నొక్కాడు రిక్షావాలా. కారుడ్రైవరుకూడా హఠాత్తుగా వచ్చిన ఆ విపత్పరిణామానికి త్రుళ్లిపడి బ్రేకులు వేశాడు. కానీ లాభం లేకపోయింది.

శేషగిరి భయంతో కళ్లు మూసుకున్నాడు. రిక్షావాలాది గట్టిశరీరంకనుక ఒకగంటసేపయినా బ్రతికి వున్నాడు. కానీ శేషగిరిమాత్రం మూసినకళ్లు మరి తెరవలేదు.

పురిటిమంచంమీద బాబు కెవ్వుమన్నాడు.

---